తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# రేపు శ్రీవారి ఆలయం మూత

## -అన్ని దర్శనాలు రద్దు



తిరుమల, నవంబర్ 6(ప్రభాతవార్తప్రతినిధి: చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం (రేపు)మరోసారి వేంకటేశ్వరస్వామి ఆలయం మూతబడనుంది. అన్ని రకాల దర్శనాలు రద్దయ్యాయి. ఉదయం 8.40గంటల నుంచి రాత్రి 7.20గంటల వరకు ఆలయ తలుపులు 11గంటలు పాటు మూసి మూసివేస్తారు. రేపుమధ్యాహ్నం 2.39గంటల నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. సర్వదర్శనం భక్తులను మాత్రమే అనుతినిస్తారు.

# పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు

రామకుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త



మండలంలోని పిఎంకె తాండా ప్రాంత పరిసరాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. గతవారం రోజులుగా ఏనుగులు పంటలపై పడి తిన్నంత తిని ధ్వంసం చేస్తున్నాయి. రవినాయక్, భాస్కర్ నాయక్, చంద్రశేఖర్ నాయక్ అనే రైతులు సాగు చేసిన వరి, బీన్స్, టమోటా, ఉలవ పంటలను నాశనం చేశాయని రైతులు వాపోతున్నారు. పగలంతా సమీపంలోని అటవీ ప్రాంతంలో తిష్ట వేస్తున్న ఏనుగులు చీకటిపడితే పొలాలపై పడుతున్నాయి. మూడు ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తుండడంతో రైతులు పొలాల వైపు వెళ్లడం లేదు. అధికారులు స్పందించి ఏనుగుల దాడులను నిరోధించాలని రైతులు కోరుతున్నారు.

# అంబేద్కర్ అందరివాడు

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్





ఎస్సీ కమీషన్ ఛైర్మన్‌ను సత్కరిస్తున్న దృశ్యం. పక్కన డా॥ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

శాంతిపురం, నవంబర్ 6 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ కొందరివాడు కాదని అందరి వాడు అని రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం శాంతిపురం మండలం శివరాంపురం పంచాయతీ గట్టూరు గ్రామంలో చితూ_తు ఎమ్మెల్సీ భరత్‌తో కలసి నూతనంగా ఏర్పాటుచేసిన భారతరత్న డా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ రాజ్యాగంలో పొందుపరచిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తే రాజ్యాంగానికి తగిన న్యాయం చేసిన వారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. అందరికీ సమానంగా భూమి ఉండాలని, అలాగే 21సం॥లనుంచి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు కల్పించారని, బిసిల హక్కుల కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు. అన్యాయం జరిగితే తిరగబడాలని, సమానత్వం కల్పించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. కులవ్యవస్థ రూపుమాపాలన్నదే డా॥ అంబేద్కర్ ముఖ్య ఆశయమన్నారు. నేడు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు నాడు -నేడు కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలనేది డా॥ అంబేద్కర్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసిలు అంబేద్కర్ కలి ్పంచిన హక్కులను సక్రమంగా ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం దళిత, గిరిజన నేతలు మాట్లాడుతూ డా॥ అంబేద్కర్ చేసిన సేవలను వివరించారు. అంతకుముందు ఎస్సీ కమీషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు దళిత సంఘాల నేతలు బాణ సంచా కాల్చి మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మావతమ్మ, జిల్లా సోషియల్ వెల్ఫేర్ అధికారి రబ్బానీ బాషా, ఆర్డీఓ శివయ్య, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపిలు వసుంధర కోదండరెడ్డి, అశ్విని, మాజీ జడ్పీఛైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, దళిత,గిరిజన సంఘాల నేతలు కృష్ణకుమారి, డా॥ యమలా సుదర్శన్, పిటిఎం శివప్రసాద్, సుబ్బన్న,కన్నన్, కందస్వామి, దేవరాజు, రాజ్‌కుమార్, మనోహర్, ఎఎస్‌డబ్ల్యుఓ నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థలో కమీషన బ్రహ్మం!




## ఏ అధికారికైనా ఆయనే మూలం
## ఏ ఫైల్ కదలాలన్నా ఇచ్చుకోవాలి ముందుగా లంచం
## లబోదిబోమంటున్న బాధితులు

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6 ప్రభాతవార్త: ఇంతకీ ఎవరీ అవినీతి బ్రహ్మం. అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కడు.. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులకు బదులుగా 24 గంటలు అందుబాటులో ఉంటాడు. ఏ ఫైలు త్వరగా ముందుకు కదలాలన్నా.. తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్ ఇతర శాఖల ఉన్నతాధికారుల సంతకాలు కావాలన్నా.. ఏ అక్రమ పని జరగాలన్నా.. ఏ కాంట్రాక్టర్ అయినా, ఏ సంస్థ ప్రతినిధి అయినా ముందుగా కలవాల్సిందే కళ్ల ముందు కనిపించే అపర అవినీతి స్వరూపం ఈ బ్రహ్మం. సార్ నా ఫైల్ వచ్చి చాలా రోజులు అయింది ఇంకా కాలేదు.. పనిచేసి కొన్ని నెలలైంది.. పనికోసం తెచ్చిన డబ్బులకు వడ్డీ కట్టలేకున్నాను సార్.. త్వరగా చేయండి సార్.. యో.. నువ్వు వెళ్లి బ్రహ్మంను కలువు పనైపోతోంది సార్.. నాకు ప్రమోషన్ లేట్ చేస్తున్నారు ఒక్కసారి కమిషనర్‌ను కలవాలి.. ఎందుకమ్మా నువ్వు బ్రహ్మంను కలువు పని అయిపోతోంది. ఇలా.. తిరుపతి నగరపాలక సంస్థలో ఏ పని కావాలన్నా ఆ శాఖ అధికారులు కన్నా ముందుగా కలవాల్సింది ఈ బ్రహ్మన్నే. కింది స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతస్థాయి అధికారులు, కాంట్రాక్టర్ల వరకు ఎవరి పని కావాలన్నా చెప్పేది ఒక్కటే పేరు బ్రహ్మం. తిరుపతి స్మార్ట్ సిటీగా కూడా ఎంపికైంది. తిరుపతి నగర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయి. దీంతో పలువురు కాంట్రాక్టర్లు నగర పాలక సంస్థలో ఏ పని కావాలన్నా బ్రహ్మం అనే వ్యక్తికి 3 నుంచి 5 శాతం కమిషన్ ఇస్తే చాలా పనులు జరిగిపోతాయని బహిరంగంగానే చెబుతున్నారు. అంతేకాకుండా ఈ వ్యక్తి కార్యాలయంలోని ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఏ పనులు ఎంతవరకు జరిగాయి. దాని కాంట్రాక్టర్లు ఎవరు.. అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. తనకు తెలియకుండా ఫైల్స్ కమిషనర్‌కు వెళ్లకూడదని, కాంట్రాక్టర్‌చే తనకు కాల్ చేపించాలని హుకుం జారీ చేస్తున్నట్లు వినికిడి. అంతేకాదు కమిషనర్‌కు సిసిగా వున్న ఓ అధికారి చొరవతోనే ఇదంతా జరుగుతోందని స్వయంగా ఉద్యోగులే ప్రాంగణంలోని టీ దుకాణం వద్ద బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. అయితే ఈ విషయాలు నగర పాలక సంస్థ కమిషనర్‌కు తెలిసో లేదో తెలియడం లేదని అనుకుంటున్నారు. కమిషనర్ ఇలాంటి వాటిపై దృష్టి సారించి వీరి ఆటలు కట్టించాలని పలువురు ఉద్యోగులు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.





# భజనలతో మార్మోగిన తిరుమలగిరులు

బాలకాండ 13వ విడత అఖండపారాయణంలో భాగంగా ఆదివారం ఉదయం "ఎంతో రుచిరా...వీరమారుతి గంభీర మారుతి"భజనలతో తిరుమలగిరులు మార్మోగాయి.

# కడలి తరంగాల్లా భక్తజనం



శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి భక్తులు కడలి తరంగాల్లా కదలి వస్తున్నారు. ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శించుకొనుటకు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. ప్రతి రోజూ 30వేల మంది భక్తులు వచ్చినట్లు సమాచారం.ఇక్కడకు వస్తున్న భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనానికి ఎంతో భక్తిశ్రద్దలతో వస్తుంటే ఇక్కడ పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారుతుంది.ఇక్కడ అడ్డదారుల దర్శనాలను క్రమబద్దీకరణ చేయటానికి చేస్తున్న ప్రయత్నాలు ఆచరణలో సాధ్యం కావటం లేదు. పిఆర్ఓ కార్యాలయం కేంద్రంగా కొందరు ఉచిత సేవకులు ప్యాకేజీలు ఖరారు చేసుకొని శివయ్య ఆలయ ఆదాయాలకు గండికొడుతున్నారు. అయితే వచ్చిన భక్తులకు సుదర్శనం, సత్వర దర్శనానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అలాగే భద్రత విషయంయంలో ఆచి తూచి అడుగులేస్తున్నారు. సంస్కరణలు చేపడుతున్నారు.అయినా ఇక్కడకు వచ్చిన భక్తులను దళారులుఏదో ఒక రూపంలో మభ్యపెడుతున్నారు. భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. సంస్కరణలు చేపడుతున్న అధికారులు అమలులో విఫలమౌతున్నారు. దాంతో దొడ్డిదారి దర్శనలు పెరుగుతున్నాయి. సామాన్య భక్తులకు తిప్పలు తప్పటం లేదు.

**సంస్కరణలు ఘనం: ఆచరణ శూన్యం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి లెక్కలేనంత మంది అతిధులు వస్తున్నారు. దాంతో ఈ ఆలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే భక్తుల దర్శనం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. అతిధుల ముసుగులో కొందరు తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఆలయాధికారి ఏమో మధ్యవర్తులను కట్టడి చేయటానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు కానీ పేరుకు సంస్కరణలు, రికార్డులు, నమోదులు. అయితే మధ్య వర్తుల దందా యథేచ్ఛగా సాగుతుంది. ఇక్కడి ఆలయంలో లెక్కకు మించి ఎపిఆర్ఓలు ఉండటంతో ఎవరు

## శివయ్య దర్శనానికి నిరీక్షణ
## అడ్డదారులు,దందాలు మామూలే!

ఎవరిని దర్శనాలకు తీసుకెళుతున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. సోమవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు 30వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నట్లు వివరించారు. సాయంత్రం రాహుకాల సమయంలో రాహుకాల మండపాల వద్ద కిట కిట లాడారు. అలాగే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలకు భక్తులు కిక్కిరిసి కనబడ్డారు. అయితే నిత్యం ఇఓ వికె సాగర్‌బాబు,ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయంలో పరిశీనలు జరుపుతున్నారు. రాహుకేతుదోష నివారణ మండపాల్లో నిఘా పెట్టారు.అయితే దళారుల దందా కొనసాగుతూనే ఉంది.తెరచాటున సంభావనలు తీసుకుంటూనే ఉన్నారు.

**రాహుకేతుదోష నివారణ పూజలు:**

*శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష ఆదరణ లభిస్తుంది.ఆదివారం రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగు వేలు దాటాయి. ఇక అభిషేకాలు 85 దాటాయి.శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం రూ.200 దర్శనం టిక్కెట్లుతో 1510 మంది, రూ.50ల దర్శనం టిక్కెట్లులో 2966 మంది రాహుకేతుదోష నివారణ పూజలకు సంబంధించి రూ.500లు టిక్కెట్లు 2543 మంది, రూ.750టిక్కెట్లతో 1071, రూ.1500 టిక్కెట్లు కొనుగోలు చేసిన 211 మంది భక్తులు రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 232 మంది, రూ.5వేల టిక్కెట్లు 49 కొనుగోలు చేసి పూజలు జరిపించు కున్నారు. కాగా అభిషేకాలు 85 శనీశ్వరాభిషేకాలు 4,మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాబిషేకాలు 33 జరిగినట్లు సమాచారం అందించారు.*

## జగనన్న సమావేశ మందిరానికి
# మంత్రిచే భూమిపూజ



నగరి, నవంబరు 6 ప్రభాతవార్త : మునిసిపాలిటీలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించనున్న జగనన్న సమావేశ మందిరానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆదివారం భూమి పూజ చేశారు. తొలుత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభం స్వాగతం పలకగా, మంత్రి స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం రూ. 30 లక్షల అంచనా విలువతో నిర్మించే సమావేశ మందిరానికి భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు సమంగా జగన్మోహనరెడ్డి పాలనలో అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ చంద్రారెడ్డి, మునిసిపల్ వైస్ ఛైర్మన్ బాలన్, పివిసిఎస్ ఛైర్మన్ తిరుమలరెడ్డి, కౌన్సిలర్లు అణ్ణియమ్మ, దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, ఆస్పత్రి కమిటీ డైరక్టర్ కృష్ణమూర్తి, నాయకులు యాకోబు, శశికుమార్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉష్ణోగ్రతలు
6/11/2022



- తిరుపతి 31 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 33 డిగ్రీలు

## జిల్లాలోనే ప్రథమస్థానం సాధించిన
# తంగేళ్ళపాళెం సహకారసంఘం



3లో

## కాణిపాకంలో పోటెత్తిన భక్తుల రద్దీ



4లో

# గంగమ్మ పరవళ్ళు-అన్నదాతల్లో ఉత్సాహం



తొట్టంబేడు, నవంబర్ 6 ప్రభాతవార్త

ఈ ఏడాది ఈశాన్యరుతుపవనాల వానలు అప్పుడప్పుడు పలకరి స్తున్నాయి. వరుణుడు కరుణిస్తుండగా ప్రకృతి పులకిస్తుంది. పచ్చదనం పరుస్తూ ఆహ్లాదాన్ని కల్పిస్తుంది. సాధారణంగా ఈ ప్రాంతాల్లో వర్షాలు ఈశాన్య రుతుపవనాలతో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కురుస్తాయి. ఈ సారి ముందస్తుగా వర్షాలు పల కరించాయి. శ్రీకాళహస్తిలో నవంబర్ సాధారణ సగటు వర్షపాతం 330.3 మి.మిలు కాగా ఒక్క ఇప్పటి వరకు 100.6మి.మీ నమో దైంది. ఇక తొట్టంబేడు మండంలలో 330.4 మీ.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 102.2 మి.మీల వర్షపాతం నమోదైంది. ఓ వైపు రుతు పవనాలతో వర్షాలు మరో వైపు తెలుగుగంగ కాలువలో గంగమ్మ పరవళ్ళు. అన్నదాతల్లో ఉత్సాహం చోటు చేసుకుంది.వ్యవసాయంలో నిత్యం నష్టాల్ని చవిచూస్తున్న రైతులకు ఈ వర్షాలు సరికొత్త ఊపిరి పోస్తుంది. తెలుగుగంగ కాలువ నిండుగా గత రెండు నెలల నుంచి పారు తుంది.ఇప్పటికే సత్యవేడు నియోజకవర్గంలోని చిన్న చిన్న చెరు వులు నిండాయి. ఇంకా తమిళనాడుకు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ఇది ఈ ప్రాంత రైతులకు మరో వరంగా మారింది.

**తమిళులకు తాగు నీరు: రైతులకు సాగునీరు:**

తమిళతంబిల దాహార్తిని తీర్చటానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆది నుంచి చొరవ చూపుతోంది. ప్రస్తుత సర్కార్‌కూడా ఈ సంప్రదాయాన్ని అమలు చేస్తుంది. ఎగువరాష్ట్రాల్లో వర్షాలు ఆంధ్ర రాష్ట్రానికి వరంగా మారింది. సోమశిలకు ఎగువ నుంచి నీరు రావటంతో కండలేరుకు విడుదల చేస్తున్నారు. అధికారిక సమాచారం మేరకు ప్రస్తుతం కండలేరు నుంచి చెన్నై వాసుల దాహార్తిని తీర్చటానికి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాలపై నైరుతీ రుతుపవనాలు కరుణ చూపాయి. గత రెండేళ్ళుగా నైరుతీ రుతుపవానాల్లో చినుకు జాడ లేదు. అయితే ఈ ఏడాది వరుణుడు కరుణ చూపించాడు. అడపా దడపా ఆగస్టు మాసం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దాంతో రైతుల్లో ఆనందం,ఉత్సాహం చోటు చేసుకుంది. ముందస్తు ఖరీఫ్‌లో వేయాల్సిన పంటల్ని వేసుకోలేక పోయారు. నాలుగేళ్ళుగా ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. తెలుగుగంగ పథకంలో అంతర్భాగమైన కండలేరు-పూండి కాలువద్వారా నెల్లూరు, చిత్తూరు జిల్లాలో 3.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటికి కండలేరులో పుష్కలంగా నీరు ఉన్నట్లు అధికారిక గణాంక వివరాలు చెబుతున్నాయి. కండలేరు-పూండి కాలువకు అనుబం ధంగా సుమారు 10 బ్రాంచి కాలువలను ఏర్పాటు చేశా రు. ఇందులో ప్రధానంగా 7వ బ్రాంచి కాలువ నుంచి నెల్లూరు జిల్లాలోని పెళ్ళకూరు, సూళ్ళూరుపేట, తడ ప్రాంతాల్లో సుమారు 30వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు.

సాధారణంగా ఈశాన్యరుతుపవనాల వల్ల అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు కళకళలాడేవి. నెల్లూరు జిల్లాలోని 78టిఎంసిల సామర్థ్యంగల సోమ శిల, 68టిఎంసిల సామర్థ్యంతో కండేరు ప్రాజెక్టుల నుంచి నీరు తెలుగుగంగ సరఫరా కావాల్సి ఉంది. సోమశిల నుంచి కండేరుకు నీటిని విడుదలచేసి నింపడం ఆనవాయితీ. ఇక్కడకు అందిన సమాచారం మేరకు 78టిఎంసి నీటి సామర్థ్యం గల కండేరులో సుమారు 69టిఎంసిల నీరు నిల్వ ఉంది.కండలేరుకు నీటిని విడుదల చేస్తున్నారు.ఒప్పందం ప్రకారం చెన్నైకు 5టిఎంసిల నీటిని ఇవ్వాల్సి ఉంది. అలాగే చిత్తూరు జిల్లాలో సాగుకు 4టిఎంసిలు, తిరుపతి త్రాగు నీటికి 1టిఎంసి, శ్రీకాళహస్తి దాహార్తిని తీర్చేందుకు 0.75 టిఎంసిలు నీటిని ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం గంగ కాలువలో సుమారు 1500క్యూసెక్కుల నీరుప్రవహిస్తూ గంగ కాలువ కలకళలాడుతోంది.

## బంగారం ధరలు
6/11/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,770

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,204

## కోడిగ్రుడ్ల ధరలు
6/11/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

# 80శాతం హామీలను పూర్తి చేసిన వైకాపా ప్రభుత్వం

-ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ

**పలమనేరు, నవంబర్ 6 ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 80 శాతం హామీలను పూర్తి చేసినట్లు పలమనేరు ఎమ్మెల్యే డా.వెంకటేగౌడతెలిపారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదేళ్ళ పూర్తి కావడంతో ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజల సమస్యలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలనే నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయన ఇచ్చిన హామీలలో సుమారు 80శాతం పూర్తి చేశారని తెలిపారు.గత ప్రభుత్వం మాటలతో పాలన చేస్తే మా ప్రభుత్వం చేతలతో పాలన చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్కుమార్రెడ్డి, మున్సిపల్ ఛైర్పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా సీనియర్ నాయకుడి మృతికి విజయ్భాస్కర్ రెడ్డి సంతాపం

**పెద్దపంజాణి నవంబర్ 6 ప్రభాతవార్త :**



పెద్దపంజాణి మండలం నేలపల్లి గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు వి.రాఘవరెడ్డి(56) మృతికి వైకాపా రాష్ట్రకార్యదర్శి, మాజీ ఎంపీపీ,రెడ్డివారి విజయ్భాస్కర్ రెడ్డి సంతాపం తెలిపారు. మండలంలో సీనియర్ నాయకులైన రాఘవరెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందడంతో విజయ్ భాస్కర్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పిం చారు.ఈ మేరకు విజయ్భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాఘవరెడ్డి అకాల మరణం పార్టీతో పాటు తనకుకూడా తీరనిలోటన్నారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ రెడ్డెప్ప,మాజీ ఎంపిటీసీ ప్రసాద్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,సన్నపరెడ్డి,శ్రీరాములు రెడ్డి,రహంతుల్లా,వేణుగోపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## 7.12 కోట్లతో మార్కెట్యార్డు అభివృద్ధికి ప్రతిపాదనలు



- ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**
కుప్పం వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి 7.12కోట్లతో ప్రతిపాదనలను రాష్ట్ర అటవీ, గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి కుప్పం ఎఎంసి ఛైర్మన్ ఎస్ విద్యాసాగర్ తీసుకెళ్లారు. ఆదివారం తిరుపతిలో మంత్రిని ఎఎంసి ఛైర్మన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఎఎంసి ఛైర్మన్ లభించేలా కృషి చేసిన మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం పొందారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అలాగే కుప్పంలో పార్టీని మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి ఆదేశించారన్నారు. కుప్పం మార్కెట్ యార్డులో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజ్, ఇ - మార్కెటింగ్ భవనం , వెయ్యి టన్నుల గోడౌన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సైతం పంపినట్లు ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్ తెలిపారు.

## వివాహిత మృతి కేసులో ఐదుమంది అరెస్ట్

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**
కుప్పం పట్టణంలోని ఆజాద్ రోడ్డులో భువనేశ్వరి అనే వివాహిత ఇటీవల మృతి చెందిన కేసులో ఐదుమందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు అర్బన్ సిఐ శ్రీధర్ తెలిపారు. తమ కుమార్తెను భర్త, అత్తింటివారు వేధించడంతోనే ఉరేసుకుని మృతి చెందిందని మృతురాలి తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసిందని ఈ విషయంగా పలమనేరు డిఎస్పి గంగయ్య విచారణ జరిపారన్నారు. ఆదివారం భువనేశ్వరి మృతికి కారణమైన భువనేశ్వరి భర్త రోహిత్కుమార్, అత్తమామలు ప్రమీల, మహదేవన్, బావ నవీన్కుమార్, అతని భార్య కౌముదిలను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు పేర్కొన్నారు.

## అంబేద్కర్ భవనం నిర్మించాలంటూ ఎస్సీ కమిషన్ ఛైర్మన్కు వినతి

**పలమనేరు, నవంబర్ 6 ప్రభాతవార్త:**



పలమనేరులో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్కు పలమనేరు తాలూకా ఎస్సీ ఎంప్లాయిస్ అసోషియోషన్ సభ్యులు వినతి పత్రం అందించారు.ఆదివారం కుప్పంలో ఓ కార్యక్రమానికి వెళుతున్న ఛైర్మన్ను కలసిన స్థానిక ఎస్సీ నాయకులు పలమనేరులో గత 20 సంవత్సరాల క్రితం 0.42 సెంట్ల భూమిని అంబేద్కర్ భవన నిర్మాణానికి కేటాయించింది.భవన నిర్మాణం కోరకు నిధులు మంజూరు చేయాలని 2012న అప్పటి ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడంతో రూ.60లక్షలు మంజూరు ప్రతిపాదనలను పంపడం జరిగిందని అప్పటి నుండి ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదని ఆయనకు తెలిపారు .ప్రభుత్వం ఆ నిధులను మంజూరు చేస్తే తక్షణం అంబేద్కర్ భవన నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భూ దురాక్రమణపై ఎస్సీ ఛైర్మన్కు ఫిర్యాదు

**బైరెడ్డిపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త:**



బైరెడ్డిపల్లె మండలంలో భూ దురాక్రమణపై రాష్ట్ర ఎస్సీ కమీషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్కు స్థానిక దళిత సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు.ఆదివారం శాంతిపురం మండలంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను స్థానిక దళిత నాయకులు కలసి బైరెడ్డిపల్లె మండలం చెక్పోస్టు కూడలి వద్ద 10సెంట్ల సంఘీక సంక్షేమ శాఖ స్థలం దురాక్రమణకు గురికావడం జరిగిందని వివరించారు.దీనిపై స్పందించిన ఛైర్మన్ తక్షణం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని నాయకులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం,చలపతి,మహేష్,గుర్రప్ప,మని తదితరులు పాల్గొన్నారు.

## దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**పలమనేరు, నవంబర్ 6 ప్రభాతవార్త:**



పలమనేరు మండలంలోని దుప్పి మాంసం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు.ఈ మేరకు స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో నిందితుడిని అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ రమేష్ మాట్లాడుతూ బయ్యపగారిపల్లె పంచాయితీ చెత్తపెంట గ్రామానికి చెందిన చిట్టిబాబు(45) గ్రామ సరిహద్దులో ఈనెల 5న దుప్పి మాంసం విక్రయిస్తుండగా ఆతనిని అరెస్టు చేసి అతని వద్ద నుండి దుప్పి మాంసం,ఒక కత్తిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్కు పంపడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది హైమవతి,శ్రీనివాసులు,షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను ఆదుకునేది వైకాపా ప్రభుత్వమేఃపెద్దిరెడ్డి

**సదుం, నవంబరు 6 ప్రభాతవార్త**
రాష్ట్రంలోని ప్రజలను ఆదుకునేది వైకాపా ప్రభుత్వమే అని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర ప్రారంబించి అయిదేళ్ల పూర్తయినసందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఆదివారం సదుం బస్టాండులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం కేక్ కట్ చేసిపంచిపెట్టారు. ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి చేస్తున్న నవరత్నాల పథకాలను గూర్చి వివరించారు.

కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులుఎల్లప్ప, జడ్పీటీసీ సభ్యుడు సోమశేఖరరెడ్డి, కోఆప్షన్ మెంబరు ఇమ్రాన్,సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి,మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, బోయ కొండఆలయ కమిటీ సభ్యుడు వెంకటరమణారెడ్డి, సర్పంచిలు ఉషా రాణి, హనుమంతురెడ్డి, శ్రీనివాసులురెడ్డి,ఎంపీటీసీలు ఆనంద, మల్లికార్జున, వైసీపీ నాయకులు బాబురెడ్డి,ధనశేఖరరెడ్డి, మాజీ సర్పంచి సయ్యద్బాషా, దామోదరరెడ్డి, రమణారెడ్డి, దాము, కువైట్ హరినాధరెడ్డి, చిన్నరమణ, మల్రెడ్డి, రెడ్డెప్పరెడ్డి,మోహన్రెడ్డి, వెంకటస్వామి, వాసు,కాలేషా, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కొత్తపేట తెదేపా ఇన్చార్జ్గా ముఖేష్ నియామకం

**కుప్పంరూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త**



కుప్పం కొత్తపేట తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జ్గా యువనేత ముఖేష్ (అప్పు)ను పార్టీ అధ్యక్షులు నియమించారు. ఈ సందర్భంగా ముఖేష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పదవి కట్టబెట్టిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అన్ని విభాగాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపేట ప్రాంతంలో పార్టీ బలోపేతానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం తెలుగుయువత నేతలు అప్పును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్,మాజీ ఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రాజ్కుమార్, జిల్లా వాణిజ్య విభాగం నేత మంజునాథ్, కుప్పం క్లస్టర్ ఇన్చార్జ్ త్రిలోక్, తెలుగుయువత అధ్యక్షుడు మణి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత మునెప్ప, మాజీ కో-ఆప్షన్ సర్దార్ బాషా కౌన్సిలర్ వేలు, మహిళా విభాగం నేత తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## 8న చంద్రగ్రహణంతో అర్దగిరి ఆలయం మూసివేత

**కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త:**
చంద్రగ్రహణం సందర్భంగా అరగొండ అర్దగిరి ఆలయాన్ని ఈనెల 8న మూసి వేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ పి.సురేంద్రారెడ్డి, ఈఓ నూకా సుబ్బారెడ్డిలు తెలిపారు. ఈనెల 8న చంద్రగ్రహణం సంభవిస్తునందున 8న ఉదయం 9 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి రాత్రి 7 గంటలకు గ్రహణానంతరం ఆలయాన్ని తెరచి శుద్ధి చేసి స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 8 గంటల నుండి భక్తులు దర్శనం వుంటుందని తెలిపారు.

## ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

**కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త:**



ప్రమాదశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండలం లోని మద్దిపట్లపల్లె గ్రామంలో ఆదివారం జరిగింది. సంఘటనకు సంభందించి కాణిపాకం ఎస్సై మనోహర్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. మద్దిపట్లపల్లె గ్రామానికి చెందిన గోవిందయ్య కుమార్తె మంజుల (35) అనే మహిళ భర్తతో మనస్పర్థల కారణంగా గత కొంత కాలంగా తమ ఇద్దరు పిల్లలను భర్త వదిలేసి పుట్టింట్లో వుంటోంది. ఈనేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం మద్దిపట్లపల్లె గ్రామ సమీపంలోని అడపగుండ్లపల్లె చెరువు వద్దకు బహిర్భూమి కోసం వెళ్ళింది. ప్రమాదశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఈవిషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మంజుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలి

**తవణంపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త:**



త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం-2 కమిటీ అధ్యక్షులు ధనంజయ అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళ్యం-2 సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆధ్వర్యంలో మండలంలో జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పల్లెచెరువు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంధములపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి రోజున దేవాలయాల్లో ధ్వజస్థంభంపై దీపాలు వెలిగించడం అనేది దేవాలయంలో దేవుని రాజ్యం ప్రారంభమైనట్లేనని తెలిపారు. కమిటీ అధ్యక్షులు ధనుంజయ ఆధ్వర్యంలో జరిగినసభ్యులు చటర్జీ, రాజేంద్ర, చాముండి, హేమంత్, లలిత, రెడ్డెమ్మ, మంజుల, రేఖ, కళ్యాణి, నాగమ్మ, విమలమ్మ, కిట్టూ ధర్మేష్, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

## 7న పుష్పవనేశ్వరాయంలో అన్నాభిషేకం

**ఐరాల, నవంబర్ 6 ప్రభాతవార్త:**
మండలంలోని నాంపల్లెలో వెలసిన శ్రీకుసుమాంబ సమేత శ్రీపుష్పవనేశ్వరాలయంలో ఆలయంలో ఈనెల 7న అన్నాభిఏకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఆలయంలో సాయంత్రం 6.30 గంటల నుండి 7.30 గంటల మధ్య స్వామివారికి ఉభయదారులచే అన్నాభిషేకం ఆరాదన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## డిసెంబర్ 3న అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవం

**సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని అయ్యప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవాన్ని డిసెంబర్ 3న నిర్వహించనున్నట్లు అయ్యప్ప భక్త బృందం వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి సన్నిధిలో పూజలు చేసిన అనంతరం ఈ కరపత్రాలు ఆవిష్కరించి, ఉదయం గణపతి హోమం, నవగ్రహ పూజ, అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సాయంత్రం అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవాన్ని స్వయంగా నిర్వహిస్తామని భక్త బృందం వారు తెలిపారు. ఈ సందర్భంగా 18 మెట్లకు పడికట్ల పూజ నిర్వహిస్తామన్నారు. మహిళా భక్తులు దీపాలను తమ వెంట తెచ్చుకొని జ్యోతుల గ్రామోత్సవంలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాదర్తి రవీంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, లీలామోహన్రెడ్డి, ఎకె రాజగోపాల్, మల్లిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కారూరు పాఠశాలలో నోటుపుస్తకాలు పంపిణీ

**తడ, నవంబర్ 6 ప్రభాతవార్త**
తడ మండలం కారూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. స్వచ్ఛంధ సంస్థకు చెందిన ఎం.భాస్కర్రెడ్డి అనే దాత ఈ పాఠశాలలో నోటు పుస్తకాలతో పాటు విద్యా సామగ్రిని అందజేశారు. గత కొంతకాలంగా భాస్కర్రెడ్డి కొన్ని ప్రాథమిక పాఠశాలలను ఎన్నుకొని అక్కడ పేదలకు స్వచ్ఛంధంగా తనవంతు సాయం చేస్తున్నారని కారూరుకు చెందిన సర్పంచ్ నిత్యసుందరరెడ్డి తెలిపారు.

## యధేచ్ఛగా పందుల సంచారం

- భయాందోళనలో ప్రజలు



**ఓజిలి, నవంబర్ 6 ప్రభాతవార్త**
ఓజిలి మండలంలో పందుల సంచారం యధేచ్ఛగా సాగుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతు న్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశు ధ్యం పడకేయ డంతో పాటు పందు ల సంచారం పెరిగి పోవడంతో పరిస్థి తి మరింత అధ్వానంగా తయారైందని పలువురు అంటున్నారు. చెత్తకుప్పల వద్దకు పందులు చేర డంతో పారిశుధ్యం మంట దేవుడెరుగు వ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజనల్వ్యాధులు ప్రబలి అవస్థలు పడుతున్న ప్రజలు పందుల సంచారంతో భయపడుతున్నారు. పారిశుధ్యాన్నిమెరుగుపరచడంతోపాటు పందుల సంచారాన్ని అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కోడి పందాల స్థావరాలపై దాడులు

**చిల్లకూరు నవంబర్ 6 ప్రభాతవార్త**



మండలంలోని కడివేడుగ్రామ శివార్లలో ఆది వారం కోడి పందాల స్థావరాలపై చిల్లకూరు ఎస్ ఐ బిగోపాల్ సిబ్బందితో కలి సి దాడులు నిర్వహిం చగా 11మందివ్యక్తులను, 2కోళ్ళను, 1790 రూపాయాలునగదు, స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి స్టేషన్కు తరలించారు. ఎస్ఐతో పాటుసిబ్బంది,సాయి,విష్ణు,బాస్కర్,పాల్గొన్నారు .

# సంక్షేమ ప్రదాత వైఎస్సార్

## - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త**
రాష్ట్రంలో సంక్షేమ ఫలాలను పేద ప్రజలకు అందించి సంక్షేమప్రదాతగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్రెడ్డి ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు.

ఆదివారం వైఎస్ జగన్మోహన్రెడ్డి పాదయాత్ర చేసిన ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా వైసీపీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవయ్య ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఉచిత వైద్యం పేదలకు అందజేశారన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారని చెప్పారు. ప్రస్తుతం ఆయన బాటలో నడుస్తూ మరిన్ని సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్న వైఎస్ జగన్మోహన్రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని చెప్పారు. పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకొని నేను విన్నాను నేను ఉన్నాను అనే నానుడిని నిజం చేస్తూ పేదలకు నవరత్నాల ద్వారా అన్ని పథకాలు వర్తింపచేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు జగన్మోహన్రెడ్డి భయపడ ప్రసక్తే లేదని సంజీవయ్య తెలిపారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ దబ్బల శ్రీమంత్రెడ్డి, కళత్తూరు శేఖర్రెడ్డి, జెట్టి వేణుయాదవ్, చిన్ని సత్యనారాయణ,పోలూరుపద్మ, అయితా శ్రీధర్, కాకి శ్రీరామమూర్తి, మల్లిశ్రీనివాసులు,పముజుల విజయలక్ష్మి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజా సంకల్ప యాత్రే పార్టీకి పునాది

**పెనుమూరు, నవంబర్ 6 ప్రభాతవార్త:**



సిఎం వైస్ జగన్మోహన్రెడ్డి గత ఐదేళ్ల క్రితం చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పునాది అయ్యిందని పెనుమూరు మాజీ సమితి ఛైర్మన్ బండి కమలా కర్రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రజా సంకల్పయాత్ర పూర్తయిన ఐదు సంవత్సరాలు అయిన సంద ర్భంగా వైకాపా నాయకుడు కామసాని విజయ్కుమార్రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకొని పార్టీని ఏకతాటిపై నడిపించి సిఎంగా నవరత్నాలతో వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రజాదరణ పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు దూది మోహన్, సాతంబాకం నరసింహారెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, సర్పంచ్లు మురళీకుమార్రెడ్డి, హరి, జయచంద్రారెడ్డి, స్థానిక నాయకులు హరికృష్ణ, లక్ష్మీపతి, దాము, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలు తనిఖీ

**పూతలపట్టు, నవంబర్ 6 ప్రభాతవార్త:**



పూతలపట్టు మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి పర్వీన్ తనిఖీ చేశారు. మండలంలోని పోలవరం, పి.కొత్తకోట పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఈమె ఆధార్ అనుసంధానంను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. పూతలపట్టు మండల పరిధిలో మొత్తం 36 వేల ఓటర్లు వుండగా అందులో 25 వేల ఓటర్లు మాత్రమే ఆధార్ అనుసంధానం జరిగిందన్నారు. మిగిలిన 10 వేల మంది ఓటర్ల ఆధార్ అనుసంధానంను ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని బిఎల్ఓలను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమం ఉప ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు విజయభాస్కర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## విఆర్ఓల నియామకంలో జాప్యం

### - యాదమరి మండలంలో కుంటుపడిన రెవెన్యూ పాలన

**చిత్తూరు, నవంబర్ 6 ప్రభాతవార్త:**
యాదమరి మండల పరిధిలో ఖాళీ అయిన విఆర్ఓల స్థానంలో కొత్త వారిని నియమించడంలో రెవెన్యూ యంత్రాంగం జాప్యం చేస్తుండటంతో మండలంలో రెవెన్యూ పాలన కుంటుపడింది. గత మూడు నెలల కాలంలో మండల కేంద్రమైన యాదమరి రెవెన్యూ పంచాయతీకి ఎవరిని విఆర్ఓగా నియమించలేదు. యాదమరి విఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్బాబును రెవెన్యూ బదిలీల్లో భాగంగా చిత్తూరు రూరల్ మండలంకు బదిలీ చేశారు. అదే సమయంలో రెవెన్యూ యంత్రాంగం ఎవరినైనా యాదమరి రెవెన్యూ గ్రామంకు విఆర్ఓగా నియమించాల్సి వుంది. అయితే రెవెన్యూ యంత్రాంగం ఈ ప్రక్రియను చేపట్టకపోవడంతో ఇప్పటికే ఇతర రెవెన్యూ గ్రామాలకు ఇన్ఛార్జీలుగా వ్యవహిస్తున్న ఒకరిద్దరిని తహసిల్దారు చిట్టిబాబు డిప్యుటేషన్పై వేసినా వారు పని ఒత్తిడిని తట్టుకోలేక చేతులు ఎత్తివేస్తున్నారు. ఈ మూడు నెలల కాలంలో ఇప్పటి వరకు ముగ్గురు విఆర్ఓలను యాదమరి విఆర్ఓగా డిప్యుటేషన్పై వేశారు. ఒకరోజు విధుల్లో వుంటున్న విఆర్ఓ మరుసటి రోజు విధుల్లో లేకపోవడంతో పనుల నిమిత్తం తహసిల్దారు కార్యాలయంకు వచ్చే ప్రజలు బేజారు చెందుతున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డిలు యాదమరి రెవెన్యూ గ్రామంకు విఆర్ఓ నియమించాలని జిల్లా రెవెన్యూ అధికారులను వేడుకొన్నప్పటికీ ఫలితం కన్పించలేదు. అలాగే ఇటీవల దసరాపల్లి, నడింపల్లి విఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేష్ గుండెపోటులో మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. ఇక్కడికి సైతం కొత్తగా ఎవరిని విఆర్ఓగా నియమించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ స్థానానికి సైతం కొత్త వారిని నియమించాలని ఎమ్మెల్యే, జడ్పీ వైస్ ఛైర్మన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి సమర్పించినా ఫలితం కన్పించడం లేదు. యాదమరి మండల పరిధిలో 24 రెవెన్యూ గ్రామాలు వున్నాయి. ఈ గ్రామాల్లో విధులు నిర్వర్తించడానికి ప్రభుత్వం 16 మంది విఆర్ఓ పోస్టులను మంజూరు చేసింది. ఇందులో ప్రస్తుతం 14 మంది విఆర్ఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. యాదమరి విఆర్ఓ రమేష్ బదిలీపై వెళ్ళినా కొత్తగా ఎవరిని నియమించకపోవడం, దసరాపల్లి, నడింపల్లి విఆర్ఓ వెంకటేష్పిళ్ళై గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఖాళీగా వున్న విఆర్ఓ పోస్టులను సత్వరం భర్తీ చేయాల్సి వుందని ప్రజలు వేడుకొంటున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పూతలపట్టు, నవంబర్ 6 ప్రభాతవార్త:**



పూతలపట్టు శరవణభవన్ ఎదురుగా వున్న సర్వీసు రోడ్డులో ఆదివారం సాయం త్రం జరిగిన రోడ్డు ప్రమాదం లో పి.చిరంజీవి (52) మృతి చెందాడు.ఆకనంబట్టు గ్రా మంకు చెందిన చిరంజీవి శర వణ భవన్ హోటల్లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తించేవాడు. చిరంజీవి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ట్రిప్పర్ ఢీకొనడంతో ఇతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన చిరంజీవిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా అతను మృతి చెందాడు. ఈ మేరకు పూతలపట్టు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లాలోనే ప్రథమస్థానం సాధించిన తంగేళ్ళపాళెం సహకారసంఘం

**తొట్టంబేడు, నవంబర్ 6 ప్రభాతవార్త**

రైతులకు సహకారం అందిస్తూ వారికి అండగా నిలుస్తున్న సహకార సంఘాల్లో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టం బేడు మండలంలోని తంగేళ్ళపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తిరుపతి జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలచింది. సహకార సంఘాల ఏర్పాటుకు తొలుత మండలంలోని కన్నలి, బోనుపల్లి, కొంణతనేరి, పొయ్య, తంగేళ్ళపాళెం, రౌతుసూరమాల, కాసరంలు ఉండేవి. అనంతరం వీటిని కుదింపు చేస్తూ కొంణతనేరి, పెద్దకన్నలి, తంగేళ్ళపాళెం, కాసరంలు ఉండేవి. తర్వాత వీటిని కూడా కుదింపు చేస్తూ తంగేళ్ళపాళెం ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘంను ఏర్పాటు చేసింది. సహకార సంస్థ 8.8.1977లో స్థాపించగా ఇక్కడ లావాదేవీలు మాత్రం 6.8.1979 నుంచి ప్రారంభించారు. మండలంలో మొత్తం 41రెవెన్యూ గ్రామాలు ఉండగా సుమారు 5,700మంది రైతులు ఉన్నారు. సంస్థ ద్వారా ఇప్పటి వరకు 2176మందికి దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందించడంతోపాటు బంగారు రుణాలు, ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి వారికి ఎప్పటికప్పుడు నగదు చెల్లిస్తున్నారు. రైతుల పాసుపుస్తకాలు తనఖా పెట్టుకుని 7శాతం వడ్డీతోఇస్తున్నారు. ఇందులో కేంద్రం 3శాతం ఇవ్వగా, రాష్ట్రం 4శాతం ఇస్తోంది. ఇక ఎరువులు మార్కెట్ ధరకే ఇవ్వడంతో పిచ్చాటూరు, అంజూరు తదితర ప్రాంతాల్లోని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. జిల్లాలోని 66సహకార సంఘాల్లో తంగేళ్ళపాళెం సహకార సంఘం తొలిస్థానం దక్కించుకుంది. సహకార సంఘానికి తొలుత ఛైర్మన్‌గా




బోనుపల్లి రాజగోపాల్‌నాయుడు తొలి అధ్యక్షుడుగా ఉన్నారు. అనంతరం రాజారాంవి.పవార్, గుడ్లూరు భాస్కర్‌నాయుడు, ఉన్నం. వాసుదేవనాయుడులు ఉండేవారు. తర్వాత గుడ్లూరుమోహన్‌కిషోర్ నాయుడు ఛైర్మన్‌గా ఇప్పటి వరకు కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఛైర్మన్ త్రీమెన్ కమిటీతో కొనసాగుతోంది. సహకార శాఖ నుంచి చెంచుపాపానాయుడు కేంద్రసహకార శాఖలో డైరెక్టర్‌గా కొనసాగారు. 2005లో ఉన్నంవాసుదేవనాయుడు సహకార సంఘ ఛైర్మన్‌గా ఉన్న సమయంలో సంస్థ పురోభివృద్ధికి రైతులు తీసుకున్న రుణాలను రూ.4కోట్లుకు పైగా రికవరీచేసి బహిరంగంగా ప్రకటించి అందరి మన్ననలు అందుకున్నారు.

**రూ.2కోట్లు బకాయిలు చెల్లింపుః-**

సహకార శాఖ నుంచి అన్నదాతలు తీసుకున్న రూ.2కోట్లు రుణాలను ప్రభుత్వానికి చెల్లించేందుకు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించగా దానిలో వచ్చే కమిషన్ల ద్వారా ప్రభుత్వానికి చెల్లించినట్లు ప్రస్తుత సహకార శాఖ అధ్యక్షుడు గుడ్లూరుమోహన్‌కిషోర్‌నాయుడు తెలి

## -రూ.2కోట్లు బకాయిలు చెల్లింపు

పారు. సహకారశాఖ ద్వారా బంగారు రుణాలతో పాటు, అన్నదా తలకు స్వల్పకాలిక రుణాలు, దీర్ఘకాలిక రుణాలైన ట్రాక్టర్ రుణాలు ఇస్తున్నారు. వీటిని ఐదేళ్లలోపు అన్నదాతలు చెల్లించాలన్నారు. సొంత భవనానికి చర్యలు.. పెట్రోలు బంకుల ఏర్పాటు.. తంగేళ్ళపాళెం ప్రాథమిక సహకార సంఘంకు 0.77సెంట్లు స్థలం ఉంది. ప్రస్తుతం ఉన్న సహకార సంస్థ పక్కనే కొత్త భవనానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక సహకార సంస్థల ద్వారా పెట్రోలు బంకుల ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నగరిలో సహకార సంస్థ ద్వారా పెట్రోలు బంకును ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా సహకార సంస్థ ద్వారా పెట్రోలు బంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని ప్రస్తుతం ఆర్డీవో కార్యాలయంలో ఇందుకు సంబందించిన ఫైలు పెండింగ్‌లో ఉందన్నారు. పెట్రోలు బంకు ఏర్పాటు చేస్తే ఇందులో వచ్చే కమిషనర్ సహకార శాఖకు దక్కుతుందన్నారు. ఈసందర్భంగా సహకార సంస్థ అధ్యక్షుడు గుడ్లూరు మోహన్‌కిషోర్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం సంస్థ రూ.19లక్షలు ఆదాయంలో ఉందన్నారు. ఇటు రైతుల సహకారం, అటు సిబ్బంది సహకారంతో సహకార సంస్థ ముందకెళ్తోందని, సొంత భవనానికి త్వరలోనే స్థానిక ఎంఎల్‌ఏ సూచనలతో భూమిపూజ చేయనున్నామన్నారు. సంస్థ అభివృద్ధికి సిఈవో చిరంజీవిరెడ్డి, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు.

## కైలాసగిరి భూముల ఆక్రమణ జరగలేదు

**శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని కైలాసగిరి కాలనీలో తాము మన్నె పల్లి రాజా బంధువులకు సంబంధించిన ఇంటి స్థలాలను ఆక్రమించుకున్నట్లు చేసిన ఆరోపణలు నిరాధారమని అంజూరు గిరిబాబు వివరించారు.ఇక్కడ తమకు 2006లో అప్పటి రెవెన్యూశాఖాధికారులు తమకు పట్టాలు జారి చేసారని వివరణ ఇచ్చారు. ఆరోపించిన రాజా స్థలానికి తమ స్థలానికి 8అడుగుల దారి ఉందని వివరణ ఇచ్చారు. సామాజిక మంచి కోసం గతంలోనే తాను ఉచితంగా స్థలం అప్పగిస్తామని చెప్పామని ఆరోపించిన రాజా బంధువులస్థలానికి తమకు సంబంధం లేదని వివరించారు.

## ఆలయ నిర్మాణానికి రోజా ట్రస్ట్ ఆర్థిక సాయం

**నగరి, నవంబరు 6 ప్రభాతవార్త :**



మండలంలో బీరకుప్పం ఆదిఆంధ్రవాడలో మాతమ్మ దేవత ఆలయ నిర్మాణానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 50,000 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానికులు మాతమ్మ ఆలయం నిర్మించి ఇవ్వాలని కోరారని వారి కోరిక మేరకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బికె ఛైర్మన్ బుజ్జిరెడ్డి, ఎంపిటిసి చంద్రారెడ్డి, నాయకులు ఏలుమలైరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, గోపి, రామచంద్ర, వెంకటేశ్, సుమన్, సతీష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## తన తండ్రి హయాంలోనే అభివృద్ధి : గాలి భానుప్రకాష్

**నగరి, నవంబరు 6 ప్రభాతవార్త**



నగరి రూరల్ మండలం ముడిపల్లి పంచాయతీలో ఆదివారం మీ కోసం – మీ తెలుగుదేశం కార్యక్రమా న్ని ఆ పార్టీ నగరి నియోజ కవర్గం ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ నిర్వహించారు. తొలుత స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించి ముడిపల్లి దళితవాడ నుంచి పర్యటన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడు, తెలుగుదేశం పార్టీ పాలనలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. గత మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి లేదు కదా, ప్రజలపై వివిధ పన్నుల రూపేణా తీవ్రమైన ఆర్థిక భారం మోపారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సదాశివకోన పాలకవర్గం ప్రమాణస్వీకారం

**పుత్తూరు, నవంబరు 6 ప్రభాతవార్త :**



ఆలయాల ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయాల పవిత్రతను కాపాడడంతో పాటు భక్తుల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా సూచించారు. ఆదివారం స్థానిక శివాలయం ఆవరణలో సదాశివకోన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రసంగిస్తూ వైసిపిలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. అనంతరం కోన ఛైర్మన్‌గా జయచంద్రన్, సభ్యులుగా ఉదయ్‌కుమార్, వాసుదేవరెడ్డి, గోపి రమణ, కమలమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడిగా అమరనాథ స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ మునికృష్ణయ్య, మునిసిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## గతుల రోడ్లకు అతుకులైనా వేయండి సారూ..!

**శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త**



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గతుకులమయంగా మారాయి. ఈనేపధ్యంలో ఎపిసీడ్స్ కూడలి వద్ద భారీ గుంతలు ఉండడంతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యగా రబ్బిష్‌వేసి తాత్కాలిక మరమ్మత్తులు చేశారు. ఇక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న చెక్‌పోస్టు వద్ద రోడ్డు గుంతలమయంగామారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో అటు మున్సిపల్ అధికారులు, ఇటు ఆర్అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక బంగారమ్మకాలనీకి వెళ్ళే మార్గంలో రోడ్లపై కంకరతేలడంతో ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని గురించి పట్టించుకునే నాధుడే లేదు. ప్రమాదాలు జరగకముందే గతుకుల రోడ్లకు అతుకులు వేసి బాగుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫోటో–ఎస్‌కెహెచ్‌టి–9

## సంపత్ మృతి కుటుంబానికి తీరని లోటు : ఎమ్మెల్యే బియ్యపు

**శ్రీకాళహస్తి, నవంబర్ 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలో అందరితో కలగోలుపుగా వ్యవహరించే సంపత్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక లూథరన్ చర్చ్ ఆవరణలో ఏర్పాటు చేసిన జ్ఞాపకార్ధ కూటమి కార్యక్రమాలకు శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి ముఖ్యఅతిదిగా వచ్చారు.మైనారిటికి చెందిన ఆర్ సంపత్ కుమార్ ఇటీవల మృతి చెందారు.వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు.మైనారిటీలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అలాగేఎవరికి ఏ బాధ వచ్చినా ఆదుకొనుటకు సిద్దంగా ఉన్నానని వివరించారు.ఆయనతో పాటు అంజూరు తారక శ్రీనివాసులు, నాని, పాస్టర్ మైకేల్, అధ్యక్షులు మార్టిన్,చర్చి సభ్యులు జయకర్, చంద్రశేఖర్, ప్రసన్నకుమార్, మెర్రి తదితరులు పాల్గొన్నారు.

## గొడుగు చింతకు ప్రతిభా పురస్కారం

**శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి గిరిజన రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో పని చేసిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గొడుగు చింత గోవిందయ్యకు ఆదివారం ఎన్‌టిఆర్ శతజయంతి ప్రతిభా పురస్కారాన్ని అందించారు.ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా బళ్ళారిలోని కృష్ణసాగర్ క్యాంప్‌లో కార్యక్రమాల్లో ప్రముఖ కవి,రచయిత గోడుగు చింత గోవిందయ్యకు పురస్కారం లభించింది.అవార్డును లయ్ గారపాటి రామకృష్ణ చేతులు మీదుగా అందించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు, పలు అవార్డులు, బిరుదులు,సన్మానాలు వివిధ సాహితీ అవార్డులను అందుకున్న గోవిందయ్యకు అవార్డు లభించటం పట్ల అభినందనీయం అన్నారు.పలువురు ఆయనను అభినందించారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

**తొట్టంబేడు, నవంబర్ 6 ప్రభాతవార్త**



గ్రామాల్లోని సమస్యలను గుర్తించి అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామని శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత.కోట అన్నారు. ఆదివారం నా నియోజకవర్గం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలంలోని పిల్లమేడు పంచాయతీ, దయనేడు, దయనేడు హరిజనవాడ, రాళ్ళపల్లి గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడి సమస్యలును తెలుసుకున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేస్తు సాగిన పర్యటనలో ప్రధానంగా గ్రామానికి వెళ్ళే రోడ్డు దారుణమైన పరిస్థితిలో గుంతలమయం అయ్యిందని గ్రామానికి బస్సు సౌకర్యం కూడా లేక 3కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఉందన్నారు. డ్రైనేజీ కాలువలు, వీధిలైట్లు,మంచినీటి కొరత ఉన్నాయని వీటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే జనసేన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ చిరునవ్వుతో పలకరిస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపి, నాయకులు రవికుమార్‌రెడ్డి, నిథీష్, ముడుసు గణేష్, శివ, శీను, తులసిరాం, జనసైనికులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కామెడి షో హాస్యనటులు

**శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న అభిషేకాలు, రాహుకేతు,కాలసర్పదోష నివారణ పూజలకు విశేష స్పందన వస్తుంది.ఈ నేపధ్యంలో ప్రతి రోజూ అతిధుల తాకిడి పెరుగుతుంది.ఈ నేపధ్యంలో జబర్ధస్త్ కామెడి షో సీనియర్ హాస్యనటులు రాకెట్ రాఘవ కుటుంబసభ్యులు కుటుంబసమేతంగా వచ్చారు.వారికి ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం చెప్పారు. స్వామి అమ్మవార్ల ఆలయాల్లో దర్శన ఏర్పాట్లు చేసారు.గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్లచిత్రపటాలను అందజేసారు. ఈ కార్యక్రమాల్లో నరిసింహులు,బాలగౌడ్,,తేజ,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదు వాసులు ఆలయానికి గంట వితరణ

**శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉమ్మడి రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున విరాళాలు అందిస్తు న్నారు. ఈ నేపధ్యంలో ఆది వారం హైదరాబాదుకు చెందిన బి.శ్రీకాంత్‌రెడ్డి కుటుంబసభ్యు లతో వచ్చారు.వారు స్వామి అమ్మవార్లను దర్శించుకున్న తరువాత ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో కలిసి తాము శివయ్యకు వెండి గంట బహూకరించాలని తనఅభిప్రాయాన్ని వివరించారు. ఛైర్మెన్ వెంటనే ఇఓ వికెసాగర్‌బాబుకు విషయం తెలిపారు. ఒక కేజి వెండిగంటను అందించారు. వారికి స్వామి అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు.ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

# ఘనంగా జగనన్న పాదయాత్ర ఉత్సవ సంబరాలు

**నారాయణవనం, నవంబర్ 6 ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు తలపెట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర నేటికి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మండలకేంద్రంలోని నారాయణవనంలో ఘనంగా ఈ వేడుకను జరుపుకున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటిఆదిమూలం,జడ్పీఫైనాన్స్ కమిటీమెంబర్‌కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ నిర్మాత



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి హారతులు పట్టారు.అనంతరంకేక్‌కట్‌చేసిచాక్‌లెట్లుపంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకా యులు, డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్ప, వైస్‌ఎంపిపి శివశంకర్, కో ఆప్షన్‌మెంబర్ సోడా మణిరెడ్డి, సర్పంచులు కెజి శారదమ్మ గణేషన్, మురుగేశం, అయ్య ప్ప శశికళ, ఏలుమలై,కుప్పస్వామిరెడ్డి,గుణశేఖర్,సుబ్ర మణ్యంరెడ్డి, ధర్మలింగం, నాగూరు, నాయకులు అన్నా దొరై, హేమ చంద్రారెడ్డి, రామన్, లక్ష్మన్,మోహన్,సుధాబాబు,శంకర్,శరవణ,ఢిల్లీ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

– మరొకరికి తీవ్రగాయాలు



**రేణిగుంట, నవంబరు 6 ప్రభాతవార్త:**

పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై ఆదివారం రేణిగుంట మండలం మల్లవరం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కథనం మేరకు... గుత్తివారిపల్లెకి చెందిన సాయి(27) మరో యువకుడితో కలసి ద్విచక్రవాహనంలో మల్లవరం వైపు నుంచి గుత్తివారిపల్లెకి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో సాయి అక్కడికక్కడే మృతి చెందగా అతనితో పాటు ఉన్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని 108లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపారు. రేణిగుంట అర్బన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జగనన్న ఆశయ సాధనలో మేమంతా భాగస్వాములమే

– ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి



**రేణిగుంట, నవంబరు 6 ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో తామంతా భాగస్వాములమవుతామని ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర నేటితోఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో వైకాపా శ్రేణులు ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 3648 కి.మీ 341 రోజులు పాదయాత్ర చేసి ప్రజల హృదయాలను దోచుకున్న గొప్ప వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగనన్న బాటలో నడుస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రెడ్డి, కుమారుడు ఆకర్షరెడ్డి, నియోజకవర్గానికి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నాగేషం, వైస్ ఎంపీపీ సుజాత, కో–ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, వైకాపా మండల మైనారిటీ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, వైకాపా నాయకులు ఇరానీ ఖాదర్, యోగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్, రాజేంద్ర, ఆసన్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజులకండ్రిగ రహదారిపై కుక్కల బెడద

**కేవీబీ పురం, నవంబరు 6 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలంలో గత రెండు నెలలుగా వీధి కుక్కల బెడద రోజు రోజుకు ఎక్కువైంది. ఆదివారం మండలంలోని ఎంప రాజులకండ్రిగలో గ్రామ సచివాలయానికి కూత వేటు దూరంలో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు రహదారిపై తిరుగుతున్నాయి. ద్విచక్రవాహన దారులను తరుముకోవడం, కరవడం చేస్తున్నాయి. అదే విధంగా కేవీబీ పురం మండల కేంద్రంలో రాగిగుంటలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రయాణికులకు వాహన దారులకు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పలువురిని వీధి కుక్కలు కాటు వేసి ఆస్పత్రి పాలైన సంఘటనలు మండలంలో అనేక గ్రామాల్లో చోటు చేసుకుంటున్నాయి. వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించవలసిన అవసరం సంబంధిత అధికారులకు ఉన్నప్పటికీ గత రెండు నెలలుగా వేదికల బెడద ఎక్కువైనప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు వాపోతున్నారు. ఎప్పుడు లేని విధంగా వీధి కుక్కలు బెడద ఎక్కువైంది. దీనికి తోడు రోడ్డు పక్కనే మాంసపు దుకాణాలు ఉన్న నేపథ్యంలో ఇంకా ఆ వీధి కుక్కలు అరుపులు, కేకలు ఎక్కువైందని పలువురు ఆరోపిస్తున్నారు. అదే విధంగా గ్రామాల్లో సైతం వీధి కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని, సంబంధితశాఖ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించవలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

## అభివృద్ధిని విస్మరించిన జగన్ ప్రభుత్వం

**వడమాలపేట, నవంబరు 6 ప్రభాతవార్త:**



బటన్ నొక్కి, గొప్పలు చెప్పుకోవడం తప్ప జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. ఆదివారం మండలంలోని లక్ష్మమ్మకండ్రిగ పంచాయతీలో మీ కోసం మీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేస్తే నేడు పంచాయతీల్లో మురుగు కాలువలు నిర్మించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చినబాబు, ధనంజయులునాయుడు, దాముయాదవ్, ఉమాపతి, లక్ష్మీప్రసన్న వెంకటేష్, భాస్కర్‌నాయుడు, వెంకటయ్య, హేమావతి, మునిరత్నం, శేషాద్రి, ప్రదీప్, రవిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 9 నుండి మహతిలో సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు

–కూచిపూడి కళాక్షేత్రం వెల్లడి

**తిరుపతి ప్రెస్‌క్లబ్,నవంబర్ 6 ప్రభాతవార్త:**



ఈనెల 9,10 తేదీలలో రెండు రోజుల పాటు స్థానిక మహతి కళాక్షేత్రంలో ఉదయం 9 నుండి రాత్రి 9 గంటల వరకు సాంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతనాట్యం,జానపదం,పేరిణి,ఆంధ్ర నాట్యంలకు సంబంధించిన ప్రదర్శనలు ఇస్తున్నట్లు శ్రీకృష్ణ నటరాజాలయం,కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకుడు,నాట్యాచార్య వ్యవస్థాపక కార్యదర్శి కొండా రవి వెల్లడించారు.ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వేదికపైన నృత్యాలను ప్రదర్శించే నాట్య బృందాలు 5 నిమిషాల లోపు ప్రదర్శన పూర్తి చేయాలని కోరారు.తిరుపతి నృత్య బాలోత్సవ్–2022 నవంబర్ మాసం బాలల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రదర్శనలో పాల్గొనదలచిన నాట్య బృందాలు 9849413592 నెంబరును సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో కూచిపూడి కళాక్షేత్రం ట్రెజరర్ కొండా సాయినాథ్,భానుకుమార్,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## ప్రజలు చూపుతున్న ఆదరణ మరువలేనిది

–ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



**తిరుచానూరు,నవంబర్ 6 ప్రభాతవార్త:**

గత 17 రోజులుగా తాను చేస్తున్న మహా పాద యాత్రకు ప్రజల నుండి వస్తున్న ఆదరణ మరువ లేనిదని తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆనందం వ్యక్తంచేశారు.ఆదివారం మోహిత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్ర వేమూరు గ్రామంలో కొనసాగింది. ఆయన గడప గడపకూ వెళ్లి ప్రజలకు నమస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా, సమస్యలుంటే చెప్పండని అంటూ ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపిటిసి యోగానందరెడ్డి మోహిత్‌రెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించి పాదయాత్రకు ఆహ్వానం పలికారు.కార్యక్రమంలో తిరుచానూరు సర్పంచ్ రామ చంద్రా రెడ్డి,పాడిపేట,ముండ్లపూడి సర్పంచులు ధనమునిరెడ్డి,సురేష్‌రెడ్డి,పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా "చంద్రగిరి గంగమ్మ జాతర" వేడుకలు

వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**చంద్రగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త:**



చంద్రగిరి గంగమ్మ జాతర వేడుకలను భక్తిప్రపత్తుల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. ఈ నెల 15 నుండి డిశంబర్ 7 వరకు నిర్వహించతలపెట్టిన చంద్రగిరి గంగమ్మ జాతర వేడుకల వాల్ పోస్టర్లను తొండవాడ వద్ద ఆదివారం ఎంఎల్ఏ ఆవిష్కరించారు.జాతర వేడుకల నిర్వహణపై పినపెద్దలు పాకాల సతీష్ కుమార్ రెడ్డి, విరూపాక్షి శంకర్ రెడ్డి ఆయనకు వివరించారు. ప్రశాంత వాతావరణంలో జాతర వేడుకలు నిర్వహించాలని ఎంఎల్ఏ సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**చంద్రగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త:**



స్థానిక పాతపేటలోని వైష్ణవి హాస్పిటల్‌లో ఆది వారం తిరుపతికి చెందిన సంకల్ప హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో డైరెక్టర్ సోమేశ్వర్ మాట్లాడుతూ సంకల్ప హాస్పిటల్ బ్రాంచ్‌ని చంద్రగిరిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, డయాబెటీస్ వంటి వ్యాధులకు చికిత్స అందించడం జరిగిందన్నారు. మెరుగైన వైద్య చికిత్సలకై పరీక్షలు నిర్వహించి ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరానికి 150 మంది హాజరై పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ పవన్ చందర్, డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది పాల్గొ న్నారు.

